లీకేజీలతో తాగునీరు కలుషితం

- మురుగు నీరు పైపుల్లోకి వెళ్తున్న వైనం
- పలు గ్రామాల్లో కలుషిత నీరు సరఫరా
- పట్టించుకోని సంబంధిత అధికారులు

మరిపెడ రూరల్: మండలంలోని వీరారం గ్రామ శివారు వడ్డెర కాలనీ సమీపంలో విస్సంపల్లి గ్రామానికి సరఫరా అవుతున్న మిషన్ భగీరథ ప్రధాన పైపులైను ఎయిర్‌వాల్ వద్ద ఇటీవల లీకేజీ అయింది. దీంతో మిషన్ భగీరథ పైపు నుంచి నీరు బయటకు వస్తుంది. బయటకు వచ్చిన లీకేజీ నీరు మురుగునీరుగా మళ్లీ పైపుల్లోకి వెళ్తోంది. మిషన్ భగీరథ అధికారులు స్పందించి లీకేజీ అవుతున్న మిషన్ భగీరథ పైపు లైన్‌కు మరమ్మతులు తక్షణమే చేపట్టి సురక్షితమైన నీటిని సరఫరా చేయాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నెల్లికుదురు: నల్లాల పైపులైన్లు, గేట్‌వాల్స్ లీకేజీలతో తాగునీను కలుషితం కావడమే కాకుండా నీరు వృథాగా పోతున్న ఎవ్వరికి పట్టింపులేదు. అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాలల్లో గ్రామ పంచాయతీ, మిషన్ భగీరథ పైపులైన్ల ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నారు. అయితే పైపులైన్ల లీకేజీలు, గేట్ వాల్స్‌ల లీకేజీలతో గుంతలు ఏర్పడి నల్లాలు వదిలిపెట్టి బంద్ చేసినప్పుడు లీకేజీల ద్వారా గుంతలోని చెత్తచెదారం పైపులోకి వెళ్లి కలుషితమైన నీరు వస్తుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన లీకేజీలు లేకుండా మరమ్మతులు చేసి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


నెల్లికుదురు: మునిగలవీడు గ్రామంలో ఎస్సీ కాలనీలో లీకవుతున్న నీరు


మరిపెడ రూరల్: వీరారం శివారులో లీకవుతున్న మిషన్ భగీరథ పైపు

సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

కేసముద్రం: కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను, పార్టీ శ్రేణులు ఇంటింటికి తీసుకెళ్లి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓట్లేసే విధంగా చూడాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలోని లక్ష్మీసాయిగార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన పార్టీ మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరైతే కష్టపడతారో వారే ఇందిరమ్మ కమిటీల్లో ఉంటారన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలోకి చేరిన సుందర్ వెంకన్న, బనిషెట్టి వెంకటేష్‌తోపాటు పలువురికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నూనావత్ రాధ, మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్, నాయకులు గంట సంజీవరెడ్డి, బండారు వెంకన్న, కదిర సురేందర్, సునీత, పోలెపాక నాగరాజు, వోలం రమేష్ పాల్గొన్నారు.


కేసముద్రం: కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కాంగ్రెస్ గెలుపే లక్ష్యం

గూడూరు: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని జిల్లా నాయకుడు మాధవపెద్ది రమేష్‌చందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సీతానగరంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న, ప్రదీప్‌రెడ్డి, బీరం శ్రీపాల్‌రెడ్డి, ఎడ్ల నరేష్‌రెడ్డి, బొల్లికొండ మధుగౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అత్యవసరమైతేనే బయటకు రావాలి



గార్ల: ఎండల తీవ్రత పెరుగుతున్నందున ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల లోపు ప్రజలు అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అంబరీషా సూచించారు. శనివారం మండలంలోని ములకనూరు పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లల వ్యాక్సినేషన్, రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోగులతో వైద్యసిబ్బంది మర్యాదతో మెలగాలని, రోగులకు వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యులు, వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. గ్రామాల్లో ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు వడదెబ్బకు గురైన వారికి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయడంతో పాటు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట పీహెచ్‌సీ డాక్టర్ విజయ్‌కుమార్, సీహెచ్‌ఓ కృష్ణార్జున్‌రావు, హెచ్‌ఈఓ శ్రీహరి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి



చిన్నగూడూరు: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని జయ్యారం గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జయ్యారం గ్రామానికి చెందిన రైతు నాగబోయిన సాంబయ్య మేత కోసం తన గేదెను గ్రామ శివారు పొలాల వద్ద మేపుతున్నాడు. పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ తీగకు గేదె తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

శరపంజరం సినిమా యూనిట్ సందడి



మహబూబాబాద్ అర్బన్: మానుకోట ప్రజలు శరపంజరం సినిమాను చూసి ఆదరించి విజయవంతం చేయాలని హీరో, డైరెక్టర్ నవీన్ కుమార్ కోరారు. జిల్లా కేంద్రంలోని ముకుంద థియేటర్‌లో శనివారం సినిమా యూనిట్ సభ్యులు సందడి చేశారు. కార్యక్రమంలో నటీనటులు లయ, వరంగల్ భాషాబాయి, అలువల సోమయ్య, మానుకోట ప్రసాద్, సదా, మ్యూజిక్ డైరెక్టర్ మల్లిక్, కెమెరా మెన్ మస్తాన్, బీఆర్‌ఎస్ నాయకులు రామరాజు యాకన్న, కత్తుల ఎలేందర్ పాల్గొన్నారు.

హామీలను నమ్మి ఓటేశారు



డోర్నకల్: కాంగ్రెస్ హామీలను నమ్మి ప్రజలు ఓటేస్తే హామీలు అమలు చేయకుండా మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ తెలిపారు. మండలంలోని ఉయ్యాలవాడ, గుర్రాలకుంట, కస్నాతండా, హూన్యాతండా, పెరుమాళ్లసంకీస, గొల్లచర్ల తదితర గ్రామాల్లో శనివారం రెడ్యానాయక్ పర్యటించి బీఆర్‌ఎస్ కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి ఎంపీ అభ్యర్థి మాలోత్ కవితను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నున్నా రమణ, ఎంపీపీ బాలునాయక్, వైస్ ఎంపీపీ తుమ్మ వెంకటరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి బిక్షంరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు నున్నా మల్లికార్జున్, బానోత్ శంకర్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.

సాధారణ బోగీలను పెంచాలి



మహబూబాబాద్ అర్బన్: ప్రతీ రైలులో సాధారణ బోగీల సంఖ్య ఐదుకు పైగా పెంచాలని ఐదు బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రతీ రైలులో ఐదు సాధరణ బోగీలను పెంచాలని విద్యార్థులు, అధ్యాపకులు ప్రధాన మంత్రి దివ్య సన్నిధికి దేశవ్యాప్తంగా కోటి ఉత్తరాల గాంధేయ మార్గంలో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజు, అధ్యాపకులు మమత, వేణుగోపాల్, రత్నమాల, రాజేందర్, యుగంధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో ఉన్నోళ్లు నాకే ఓట్లేస్తరు..

- ఎంపీ అభ్యర్థి సీతారాంనాయక్

కేసముద్రం: 'బీఆర్‌ఎస్‌లో ప్రాణాలకు తెగించి పని చేశాం.. మీమంతా అన్నదమ్ముళ్లలాగా కలసి ఉన్నాం.. నేనంటే ఏందో వారికి తెలుసు అందుకే బీఆర్‌ఎస్ ఓటు నాకే పడుతుంది' అని మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు పాదిల నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగిన బీజేపీ బూత్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీలో తెలంగాణ ద్రోహులకే మాజీ సీఎం కేసీఆర్ టికెట్‌లు ఇచ్చాడని, తెలంగాణ కోసం ప్రాణాలకు తెగించి కొట్లాడిన తనకు గత ఎంపీ ఎన్నికల్లో టికెట్ ఇవ్వకుండా అన్యాయం చేశాడని విమర్శించారు. ఉద్యమపార్టీ టీఆర్‌ఎస్‌ను, బీఆర్‌ఎస్‌గా మార్చడంతోనే తాను పార్టీని వీడానన్నారు. కార్యక్రమంలో ఒద్దిరాజు రామచందర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మారెడ్డి, చైర్మన్ మాధవపెద్ది శశివర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ మాజీ అధ్యక్షుడు ఒద్దిరాజు రామచందర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మారెడ్డి, చైర్మన్ మాధవపెద్ది శశివర్ధన్‌రెడ్డి, వల్లభు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, వెంకటాచారి పాల్గొన్నారు.


కేసముద్రం: మాట్లాడుతున్న సీతారాంనాయక్

రిజర్వేషన్ల రద్దు ఆలోచన కాంగ్రెస్‌దే

నెల్లికుదురు: ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీల రిజర్వేషన్ల రద్దు చేయాలనే ఆలోచన కాంగ్రెస్‌దే అని సీతారాం నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు.

మోదీతోనే దేశం అభివృద్ధి

మరిపెడ రూరల్: ప్రధాని నరేంద్ర మోదీతోనే దేశ అభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బింగి రమేష్ అన్నారు. శనివారం మండలంలోని గుండెపుడి గ్రామంలో పార్టీ నాయకులతో కలసి ప్రచారం నిర్వహించారు.

సీతారాంనాయక్‌ను గెలిపించాలి

డోర్నకల్: సీతారాంనాయక్‌ను గెలిపించాలని పార్టీ మండల అధ్యక్షుడు గణేష్‌నాయక్ మండలంలోని గొల్లచర్ల శివారు తండాలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వర్‌రావు, రెహమాన్, పవన్‌కల్యాణ్, హన్మంతు పాల్గొన్నారు.

బీజేపీని గెలిపించాలి

కురవి: ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మారం వెంకన్న పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ సభ్యుడు పెంటయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్: వలసలను నిరోధించడానికి గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ కూలీలకు పని చూపెడుతున్న మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలు పరిష్కరించాలని ప్రగతిశీల అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మగాని సత్యం, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పైండ్ల యాకయ్య అన్నారు. మండలంలోని కంబాలపల్లి గ్రామంలో శనివారం కూలీలను కలసి మాట్లాడారు. కార్యక్రమంలో కొమురయ్య, సైదులు, పెంటయ్య, వెంకన్న పాల్గొన్నారు.

కూలి రూ.600 ఇవ్వాలి

నర్సింహులపేట: ఉపాధి కూలీలకు కొలతలు లేకుండా రోజుకు రూ.600 ఇవ్వాలని, ఉపాధి పని రోజులను 200 పెంచాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు బండపల్లి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ముంజంపల్లి వీరన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని బొజ్జన్నపేట, జయపురం గ్రామాల్లో ఉపాధి హామీ పనులను శనివారం సంఘం నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాపారావు, ఇరుగు అనిల్, రామస్వామి, వెంకటయ్య, వీరమ్మ పాల్గొన్నారు.

కవితను మెజార్టీతో గెలిపించాలి


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బిందు

గార్ల: మహబూబాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత గెలుపు కోసం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు పిలుపునిచ్చారు. శనివారం గార్లలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి అధికారం చేపట్టిందని, పాలన 200 రోజులు దాటినా ఆరు గ్యారంటీలను నేటికి అమలు చేయడం లేదన్నారు. మే 1వ తేదీన మాలోత్ కవిత గెలుపు కోరుతూ మహబూబాబాద్‌లో నిర్వహించే కేసీఆర్ రోడ్‌షో, బస్సుయాత్రను విజయవంతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, పార్టీ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి లింగాల ఉమేష్, ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడు బుడిగ మురళి, కోఆప్షన్ సభ్యుడు ఎండి ఖదీర్ పాల్గొన్నారు.

పరామర్శ

మహబూబాబాద్ రూరల్: బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు మార్నేని రఘు బావ కొమ్మినేని వెంకన్న ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకన్న, కౌన్సిలర్ శ్రీదేవి, నాయకులు పాల్గొన్నారు.

ఎల్లంపేటలో..

మరిపెడ రూరల్: మండలంలోని ఎల్లంపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గండి మస్తాన్ (70) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ రాథోడ్ సత్యవతి రాథోడ్ శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకలు


మహబూబాబాద్: జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీ కవిత, నాయకులు


తొర్రూరు: కేక్ కట్ చేస్తున్న దయాకర్‌రావు, మధుసూదనాచారి

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి , వైస్ చైర్మన్ మహ్మద్ మార్నేని వెంకన్న, నాయకులు రవి, రాజు, ముత్యం వెంకన్న, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో బీఆర్‌ఎస్‌దే అధికారం

తొర్రూరు రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రజల ప్రయోజనల కోసమే ఆవిర్భావించిన పార్టీ బీఆర్‌ఎస్‌కే భవిష్యత్‌లో అధికారం దక్కుతుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ వేడుకల్లో వారు పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మెట్టు శ్రీనివాస్, పసుమర్తి సీతారాములు, తూర్పాటి అంజయ్య, మంగళపెల్లి శ్రీనివాస్,డాక్టర్ పొనుగోటి సోమేశ్వర్‌రావు, శామకూరి ఐలయ్య పాల్గొన్నారు.

పెద్దవంగర: బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య బీఆర్‌ఎస్ జెండా ఆవిష్కరించాడు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు మెట్టు శ్రీనివాస్, రామచంద్రయ్య శర్మ, నాయకులు పాల్గొన్నారు.

గార్ల: బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్ ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శీలం శెట్టి రమేష్, రాధాకృష్ణ, గణేష్, ప్రభాకర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

మహబూబాబాద్ అర్బన్: కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లో గెలిచిన అభ్యర్థులు అభివృద్ధి చేసింది ఏమి లేదని, తనకు ఒక్కసారి అవకాశం ఇచ్చి ఆశీర్వదిస్తే మానుకోటను మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని బీఎస్పీ ఎంపీ అభ్యర్థి కోనేటి సుజాత కోరారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడారు. తెలంగాణలో 17 ఎంపీ స్థానాల్లో బీఎస్పీ పోటీ చేస్తుందన్నారు. బీజేపీ గెలిస్తే రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తుందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఎంత మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారన్నారు. ఎన్నికల్లో బీఎస్పీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో పార్లమెంట్ ఇన్‌చార్జ్ దార్ల శివరాజ్, జిల్లా ఇన్‌చార్జ్ దార ప్రసాద్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల శ్రీను, అసెంబ్లీ కన్వీనర్ తోకల నాగరాజు, జిల్లా ఈసీ సభ్యులు తప్పెట్ల చాణిక్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సుజాత

'బీజేపీతో సంపన్న వర్గానికే మేలు'


సమావేశంలో మాట్లాడుతున్న రాములు

నెహ్రూసెంటర్: కేంద్రంలో పదేళ్లగా అధికారంలో ఉంటూ కార్మిక హక్కులను కాలరాస్తూ, రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. 'పార్లమెంట్ ఎన్నికలు- కార్మికవర్గం కర్తవ్యం' అనే అంశంపై జిల్లా కేంద్రంలోని జగన్నాథ భవన్‌లో జిల్లాస్థాయి సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ సంపన్నవర్గానికి మాత్రమే మేలు చేసిందన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తామంటూ బీజేపీ ఎంపీలు, మంత్రులు బహిరంగంగా మాట్లాడడం దేశంలో నియంతృత్వం పెరిగిందనడానికి నిదర్శనమన్నారు. మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ సదస్సులో ఆకుల రాజు, సమ్మెట రాజమౌళి, నాగన్న, దార స్నేహబిందు, గుగులోత్ సరోజ, తాడబోయిన శ్రీశైలం పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మే 3న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో మే 3న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ రమాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మే 6న జెడ్పీ సర్వసభ్య సమావేశం ఉంటుందన్నారు. గౌరవ సభ్యులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని ఆమె కోరారు.

వాలీబాల్ టోర్నీ ప్రారంభం

తొర్రూరు: డివిజన్ కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానంలో తొర్రూరు ఎంప్లాయీస్ వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి కప్ వాలీబాల్ టోర్నమెంట్‌ను మండల నోడల్ అధికారి బుచ్చయ్య శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోఆర్డినేటర్ రాయిపెల్లి యాకయ్య, ప్రతినిధులు రాములు, మహేష్, మురళీ, నాగరాజు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

మరిపెడ రూరల్: మానవ అక్రమ రవాణా నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సోషల్ సర్వీస్ సొసైటీ (ఎఫ్‌ఎంఎం) సంస్థ ఫీల్డ్ మండల కోర్డినేటర్ సీరుడు శిరీష అన్నారు. మండలంలోని బుర్హాన్‌పురం గ్రామంలో శనివారం ఎఫ్‌ఎంఎం, మై చాయిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి శేర్ల మంజుల, ఫీల్డ్ కోఆర్డినేటర్ చల్లా సమర, మహిళలు పాల్గొన్నారు.

మోదీ సర్కార్‌ను సాగనంపాలి

గూడూరు: కార్మిక చట్టాలను రద్దు చేస్తున్న మోదీ సర్కార్‌ను సాగనంపాల్సిన అవసరం ఆసన్నమైందని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. మండల కేంద్రంలో శనివారం జీపీ, హమాలీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. మే డేను ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మికులు నర్సయ్య, వెంకటయ్య, బాలు, మహేందర్, సంతోష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌కి చెందిన ఎస్కే.అబ్దుల్ అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. ఈమేరకు అంతర్యామి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం బాధిత కుటుంబానికి రూ.8వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

నెల్లికుదురు: ఓటు హక్కు ఉన్న ప్రతీ ఒక్కరు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించు కోవలని తహసీల్దార్ రాజు అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఓటరు స్లిప్పులను బీఎల్‌ఓల సూపర్‌వైజర్ ప్రసన్న, బీఎల్‌ఓలు పద్మ, స్వప్న, రమేష్, రాంబాబులతో కలసి పంపిణీ చేశారు.

ప్రీ స్కూల్ డే వేడుకలు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతి మాట్లాడుతూ.. ప్రీ స్కూల్ విద్యతో పిల్లల మేధో వికాసానికి ఎంతగానో తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శిరీష, సరిత, భారతి, సుజాత పాల్గొన్నారు.

తాగునీటి వసతుల పరిశీలన

నెల్లికుదురు: మండలంలోని రత్తిరాం తండాను డీపీఓ హరిప్రసాద్, మిషన్ భగీరథ ఈఈ కృష్ణ, ఎంపీడీఓ బాలరాజు, ఎంపీఓ పార్థసారథి శనివారం సందర్శించి తాగునీటి వసతులు పరిశీలించారు. డీపీఓ మాట్లాడుతూ.. రత్తిరాం తండాతోపాటు శివారు తండాలల్లో తాగునీటి సమస్య లేదన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ

మహబూబాబాద్ రూరల్: మండలంలోని కంబాలపల్లి గ్రామంలో దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపన పూజల్లో భాగంగా అభయాంజనేయ స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మహిళలు భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో ముఖ్య కార్యకర్తలు సత్యనారాయణ, రమేష్, సుధాకర్ రెడ్డి, శివకోటి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బీజేపీని ఓడించాలి

కేసముద్రం: కార్మిక చట్టాలపై ఉక్కుపాదం మోపుతున్న బీజేపీని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి మంద భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

సీపీఎం సంపూర్ణ మద్దతు

గార్ల: మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌కు సీపీఎం రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు శనివారం తెలిపాడు. ఈ సమావేశంలో నాయకులు పెద్దవెంకటేశ్వర్లు, ఈశ్వర్‌లింగం, వీరస్వామి, లోకేశ్వరరావు, ఉపేందర్‌రెడ్డి, రామకృష్ణ, ఎల్లయ్య పాల్గొన్నారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

తొర్రూరు రూరల్: తాటి చెట్టుపై నుంచి ప్రమాదశాత్తు పడిన ఓ గీత కార్మికుడికి తీవ్ర గాయాలైనా సంఘటన మండలంలోని గుర్తూరు గ్రామంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఉమ్మగాని వెంకన్న అనే గీత కార్మికుడు రోజువారీగా సాయంత్ర తాటి చెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా ప్రమాదవశాత్తు పైనుంచి జారి కింద పడడంతో కాలు, చేతి విరగగా, తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో తొర్రూరులోని ఓ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

బాల్య వివాహం.. ఐదుగురిపై కేసు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఓ తండాలో బాల్య వివాహం జరుగగా ఐదుగురిపై కేసు నమోదు చేశామని రూరల్ ఎస్సై కుమారస్వామి శనివారం తెలిపారు. మైనర్‌కు వివాహం జరిపించిన తల్లిదండ్రులతోపాటు గూడూరు మండలంలోని ఓ తండాకు చెందిన వరుడు, అతడి తల్లిదండ్రులపై కేసు నమోదు చేశామన్నారు. శుక్రవారం రాత్రి వివాహం జరిగిందన్నాడు. తమకు వచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపాడు.

నిబంధనలు పాటించాలి

చిన్నగూడూరు: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్సై ఝాన్సీ అన్నారు. శనివారం మండలంలోని నర్సింహులపేట క్రాస్ రోడ్డు వద్ద ఎస్సై ఝాన్సీ ఆధ్వర్యంలో విస్తృత వాహన తనిఖీలు చేపట్టారు. ఆధారాలు లేకుండా రవాణా చేస్తున్న రూ.70వేలు నగదును పట్టుకుని ఫ్లైయింగ్ స్క్వాడ్ టీం రవీందర్ రావుకు అప్పగించామన్నారు.

విజయవంతం చేయాలి

కురవి: మేడేను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మే డే ఉత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యకమంలో సీపీఐ మండల కార్యదర్శి రాజన్న, బాలకృష్ణ, సమ్మయ్య, రమేష్, వెంకన్న పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



డోర్నకల్: మండలంలోని గుర్రాలకుంట గ్రామ పంచాయతీ పరిధిలోని టేకులతండా సమీపంలోని వ్యవసాయ భూముల్లోని గుడుంబా తయారీ కేంద్రాలపై శనివారం జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ నిరజ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 600 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, 5లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్సై కిరీటి తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది జ్యోతి, ఇందిర, వెంకన్న, నర్సింహ, గద్దర్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలి

గార్ల: మండలంలోని అంజనాపురం గ్రామంలోని గుడిసెంటర్ బజారులో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి జి.సక్రు డిమాండ్ చేశారు. శనివారం అంజనాపురం గ్రామంలోని గుడిసెంటర్ బజారులో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న ప్రజలతో ఆయన మాట్లాడారు. గుడిసెంటర్ బజారులో సుమారు 50 ఇళ్లు ఉండగా, ఈ వీధికి మిషన్ భగీరథ తాగునీటి కుళాయిలు రావడం లేదన్నాడు. సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదన్నాడు. తాగునీటి కోసం ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. తాగునీటి ఎద్దడిని నివారించడానికి అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సక్రు డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో పీవైఎల్ మండల కార్యదర్శి మంగీలాల్, చిన్న, బాబుసింగ్, రవి, తదితరులు పాల్గొన్నారు.